
# అనుకోని సంఘటన




అది చిట్టికి కలిగిన ఆలోచనకాదు. కమలే చిట్టిని రెచ్చ గొట్టింది. మొదట్లో చిట్టి "ఎందుకు పోనిస్తూ," అన్న ధోరణిలో మాట్లాడిందిగాని, బొత్తిగా నిరుత్సాహపరిస్తే కమల తనను అపార్థం చేసుకుంటుందనుకుని కమలను తనలాగ ముస్తాబుచేసి తనకారులో మహాబలిపురం పంప టానికి సమ్మతించింది.

చిట్టి అసలుపేరు వేరేవుంది. ఆమె ఇప్పుడిప్పుడే పైకి వస్తున్న సినిమా తార. కమల చిట్టికి పినతల్లి కూతురు. ఇద్దరూ బొత్తిగా కవల పిల్లలల్లే వుండకపోయినా, విడి విడిగాచూస్తే ఒకరినిచూసి మరొకరని పొరపాటు పడతగి నంత పోలిక వున్నది. కమల కాకినాడ్లో కాలేజీచదువు చదువుతోంది. బియ్యే మొదటిసంవత్సరం పూర్తిచేసి శల వులకు మద్రాసు వచ్చింది. కమలకూ చిట్టికీ ఉండే పోలిక కాలేజీ పిల్లలందరికీ తెలుసు. చాలామంది ఆమెను చిట్టి పేరుపెట్టే పిలిచేవారు. ఒక్కోరోజు కమల చిట్టి వేసిన ఏదో ఒక వేషంలాగా తయారై కాలేజికి వెళ్ళేది. ఆమెను అంతదూరంలో చూడగానే పిల్లలు హర్షధ్వానాలు చేసేవారు. అనేకమంది స్నేహితురాళ్లు కమలని సినిమాలో వేషాలు సంపాదించమని ప్రోత్సహించారుకూడా. అయితే కమలకు సినిమాలోకంటె బయటనే వేషాలు వెయ్యటం సరదా.

ఈ సరదామూలంగానే కమల ఈ ఆలోచన చేసింది: ఏదో ఆదివారంనాడు చిట్టిలాగా ముస్తాబై మహాబలిపురం లాంటి సమీపతీర్థానికి చిట్టికారులోనే వెళతామని. నిన్ననే చిట్టికి కొత్త పిక్చరులో ఎగ్రిమెంటయింది. ఆ ఉత్సాహంలో కమల ఇవాళ తనకోరిక నెగ్గించుకుంది.

కమల కారులో బయలుదేరినాక చిట్టి తనలోతాను నవ్వు కుంది. సినిమానటులు చాలా రొమాంటిక్‌గా ఉంటారని అందరూ అనుకుంటారు. కాని నిజమైన రొమాన్స్ ఇత రులది. లేకపోతే కమల ఇదేం పని? సినిమాలుచూసే వాళ్ళు కనే పగటికలల్లో ఎన్నోవంతు సినిమా తారలకి సాధ్యమవుతుంది?


ఒకప్పుడు తానుకూడా ఈ కమలలాగా ఉండిన మనిషే. ఆరోజుల్లో తానుపొందిన ఆనందం తనకిక మళ్ళీరాదు. తనకన్న కమల మూడేళ్ళే చిన్న. అయినప్పటికీ ఇద్దరి మధ్యా పెద్ద అగాధం వుంది. ఇంక పన్నెండేళ్ళకుకూడా కమల తనలాగా లోలోపల ఎండిపోదు.

అయితే చిట్టి చింతించలేదు. ఆర్థికవిజయం ఎదురుగా కనిపిస్తూండగా ఏ మనిషికూడా తనలో కలిగిన పరిణా మాలకు పశ్చాతాప పడలేదు. తాను చిట్టికాకుండా కమల అయివుంటే బాగుండునన్న ఆలోచన ఆమెకు ఎంత మాత్రమూ కలగలేదు.

ఆఖరుకు భగ్నమైపోయిన తన ప్రణయం గురించికూడా చిట్టి ఇప్పుడు విచారించటంలేదు. చిట్టి రామాయణంలో అదొక పిట్ట కథకింద తేలిపోయింది. దాదాపు ఆరేళ్ళక్రితం చిట్టి తన తలిదండ్రులతో బెజవాడలో ఉంటూవుండగా పక్క ఇంట్లో ఒక కుర్రవాడు ఉండేవాడు. పేరు కృష్ణమూర్తి. కొంచెం షోకిల్లా. ఆడవాళ్ళు చేసుకున్నంత టాయిలెట్ చేసుకునేవాడు. కాలేజిచదువు పూర్తిచేశాడల్లే వుంది. ఉద యం ఒకసారీ సాయంకాలం ఒకసారీ బయటికి వెళ్ళేవాడు. రెండుసార్లూ రెండు డ్రెస్సులు వేసేవాడు. సాయంకాలం పూట మరీ బాగా డ్రెస్ చేసుకునేవాడు, శాటిన్‌పాంటు, టెన్నిస్ షూలూ, నీలం ట్వీడ్‌కోటూ, తెల్లటి ఊలు స్కార్ఫ్ ధరించేవాడు. జుట్టుకు వాసలైన్ రాచి నున్నగా

నిగనిగలాడేట్టు దువ్వేవాడు. జేబులో సిల్కు చేతిరుమాలు జాగ్రత్తగా, ఒకకొన పైకి కనపడేట్టు పెట్టేవాడు, సిగిరెట్టు ముట్టించేవాడు, టెన్నిస్‌రాకెట్ పట్టుకుని సైగల్‌పాట ఏదో ఒకటి ఈలవేస్తూ బయలుదేరేవాడు. చిట్టి పెద్దన్న కృష్ణమూర్తికి "దసరాబుల్లాడు" అని పేరుపెట్టాడు. కాని చిట్టికిమటుకు అతన్నిచూస్తే చాలా ముచ్చటగానే ఉండేది. ఈ దిక్కుమాలిన ప్రపంచంలో కృష్ణమూర్తి వంటివాడు ఒక్కడైనా జీవితం ఆనందిస్తున్నాడనిపించేది. అయితే చిట్టికి అతనిమీద ముందుగానే ప్రేమ కలిగిందనటానికిలేదు.

అటువంటి భావం ఆమెకు మొట్టమొదటిసారిగా కలిగింది అతను మొట్టమొదటిసారిగా తనకు చీటీరాసి అందించినప్పుడు. అది ప్రపంచంలోకల్లా సంగ్రహమైన ప్రేమలేఖ అనవచ్చు. ఆ చీటీలో "నా చిట్టీ" అనే మూడక్షరాలే ఉన్నాయి. అయితే ఆ మూడక్షరాలూ చిట్టి హృదయంలో రేపిన తుపాను ప్రపంచంలో ఉండే పుస్తకాలన్నీ కలిసికూడా రేపివుండవు. ఈ తుపానులో ఆమె ఒంటరిదైపోయింది. ప్రపంచానికీ తనకూ మధ్య ఒక పెద్దతెర దిగిపోయింది. ఆతెర ఇవతలతానున్నది. అవతల ఒక్క కృష్ణమూర్తి మాత్రమే ఉన్నాడు.



ఈ తుపాను ఉద్రేకం తగ్గినాక చిట్టికి ఎక్కడినుండో చెప్పలేని ధైర్యం వచ్చింది. చీటీఅందిన మర్నాడు చిట్టి దడి దగ్గిరికివచ్చి, "ఏమండీ, మీరింకా టెన్నిస్‌కు బయలుదేరలేదేం?" అని అడిగింది, ఇంకా అతను బయలుదేరే వేళ కాలేదని తెలిసికూడా. వెంటనే జవాబు చెప్పలేక అతను పడ్డ కంగారు తలుచుకుని చిట్టి చాలారోజులు ఆనందించింది.

చిట్టి సాహసించి ఉత్తరం రాయలేదుగాని కృష్ణమూర్తి ఆమెకు చాలా ఉత్తరాలు అందించాడు. వాటన్నిటినీ భద్రంగాదాచి చదువుకుని చిట్టి ఏ పొయ్యిమంటలోనో ఎవరూ చూడనప్పుడు వేసేస్తూండేది, ఒక్కరాత్రి దడి దగ్గిరికివచ్చి తనతో మాట్లాడమని మూర్తి ఎన్నోసార్లు చీటీల ద్వారా బ్రతిమాలినమీదట ఒకరాత్రి చీకటిలో నల్లచీరె కట్టుకు వెళ్ళింది. కాని మాటలు జరగలేదు. మూర్తి ఆమెను తమవేపు రమ్మన్నాడు. ఆమె వెళ్ళలేదు. అతను విసుగెత్తి దడిగెంతి ఇవతలికి వచ్చాడు. ఆమెను పట్టుకుని బలాత్కారంగా ముద్దు పెట్టుకున్నాడు, అతనిపట్టు విడిపించుకుని చిట్టి ఇంట్లోవచ్చి పడింది.

మర్నాటినుంచీ అతనిలో ఏదోమార్పు కనిపించింది. అతని ఉత్సాహమంతా పోయింది. ఈలపాట మానేశాడు, షోకు చాలా తగ్గిపోయింది. అతనికీ తండ్రికీ చిన్నఘర్షణ జరిగిందిట. అతను చిట్టిని పెళ్ళాడతానంటే తండ్రి ఒప్పుకోలేదు. వాళ్ళు ధనికులు. చిట్టివాళ్ళుకారు. కృష్ణమూర్తి తండ్రివగ్గిర అస్వతంత్రుడు.

ఇదిజరిగిన రెండునెల్లకు చిట్టి జీవితం తారుమారయింది. ఆమె ఎవరూ అనుకోకుండా సినిమాల్లో ప్రవేశించింది. మూడేళ్ళపాటు సినిమాల్లో ఉండికూడా చిట్టికి చెప్పుకోదగ్గ పేరుగాని, డబ్బుగాని రాలేదు. రెండేళ్ళక్రితం చిట్టిదశ పూర్తిగా మారింది. ఆమె తార పైకెక్కి సాగింది.

ఇప్పుడు పాతకథ జ్ఞాపకం తెచ్చుకుంటే తన ప్రణయం తుఫానులో ఒకగాలి విసురంతగాకూడా కనిపించలేదు. చిట్టి తనలోతాను నవ్వుకుంది. తనకింకా పెళ్ళికాలేదు. కాని చేసుకుంటానంటే లక్షాధికార్లు సిద్ధంగా వున్నారు.

## 2

కమలకు మహోల్లాసంగా వుంది. కారు చెంగల్పట్టు సమీపిస్తున్నది. అప్పటికే ఆమె డ్రైవరుతో అయిదారుసార్లు చెప్పింది—ఇల్లుచేరిందాకా ఎవరితోనూ ఏమీ మాట్లాడవద్దని. అతను ఆరుసార్లు, "సరేనమ్మా," అని అదే గొంతుతో సమాధానం ఇచ్చాడు.

"చెంగల్పట్టులో ఇడ్లీ కాఫీ భోంచేస్తారా?" అని అడిగాడు డ్రైవరు.

కమల సరేనన్నది. ఆమె ఇంటిదగ్గిర కొద్దిగా ఫలహారంచేసి కాఫీ తాగింది. మధ్యాన్నానికి భోజనమూ, సాయంకాలానికి ఫలహారమూకూడా కారులోవుంది. ఒకరికికాదు నలుగురికి సరిపోయినంత వుంది. అయినా చెంగల్పట్టులో ఆగి ఎవరేమనుకుంటారో చూదామనిపించింది కమలకి.

కారు చెట్లకింద పార్కు-చేసి డ్రైవరు, ఎదురుగాఉండే హోటళ్ళలో ఒకదానికి వెళ్ళాడు. కమల పేపరొకటి కొని చదవసాగింది. కాని ఆమెదృష్టి పేపరుమీదలేదు. రెండు నిమిషాలయినాక కొందరు యువకులు గట్టిగా మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ ఒక హోటల్లోనుంచి బయటికి వచ్చి రోడ్డుమీద నిలబడి సిగిరెట్లు అంటించసాగారు. అందులో ఒకడు కమల కూచునిఉన్న కారుకేసిచూసి ఏదో అన్నాడు. మరుక్షణం నలుగురు కారుకేసి చూశారు. వాళ్ళలోవాళ్ళేదో మాట్లాడుకుని కారుకేసి నడిచివచ్చి పక్కగావెళ్ళి కారువెనక నిలబడ్డారు. వాళ్ళమాటల్లో "సార్" అనేమాటా, చిట్టి నటించిన సరికొత్త పిక్చరు పేరూ కమలకు స్పష్టంగా వినిపించి పరమానందమయింది. ఆమె చిట్టి అవునా, కాదా అన్న సంఘర్షణ వారిలో రాలేదు.

కారువెనుక నిలబడ్డవారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్టుకమలకు తోచింది. అటూ ఇటూ వెలుతురుకడ్డంగా జనం నిలబడ్డారు. వాళ్ళ ముఖాలు కమలకు కనిపించలేదు. వెనకవాళ్ళు ఇతర తారలనుగురించి మాట్లాడుతున్నారు.

"ఇంతకుముందు వైజయంతిమాల ఇటుగా వెళ్ళింది," అన్నాడొకడు.

"షటప్‌రా! వైజయంతిమాల ఇక్కడెక్కడుంది?" అన్నాడు ఇంకొకడు.

ఇంకా ఇతర తారలనుగురించి చర్చ జోరుగా సాగిపోతున్నది. ఆ సంభాషణయావత్తూ తన నిమిత్తమే అయి ఉంటుందని కమల ఊహించింది.

ఇంతలో డ్రైవరు వచ్చాడు. పెద్ద పొట్లం తెచ్చాడు. కమలకు పొట్లం విప్ప బుద్ధికాలేదు. ఆమెకిప్పుడు ఇంకో భయం పట్టుకున్నది—మహాబలిపురానికి ఇతర సినిమా వాళ్ళెవరైనా వస్తారేమోనని. కొంపదీసి అదే జరిగితే చిక్కే. చిట్టినెరిగినవాళ్ళెవరైనా ఉంటే తనను పలకరించవచ్చు, తనమోసం గుర్తించనూవచ్చు.

"అంతగా అయితే నేను చిట్టిని కానని చెప్పేస్తాను. ఇందులో కొంపమునిగేదేముంది?" అని కమల తనకు తాను సమాధానం చెప్పుకుంది. అయితే తనను పలకరించే వాళ్ళు చిట్టిని ఎరిగుండి ఆ సంగతి తనకు తెలియక తానే చిట్టి అయినట్టు నటిస్తే ఏమవుతుందోనన్న ఆలోచన కమలకు తట్టలేదు.


"మనం బయలుదేరి పోదామోయ్," అన్నది కమల.

"ఇడ్లీ భోంచెయ్యండి, పోదాం. ఎంతసేపు? ఇప్పుడే పోతే పక్షితీర్థం దగ్గరైనా ఆగాలిసిందే. మధ్యాన్నానికి గాని పక్షులు రావు," అన్నాడు డ్రైవరు.

"పోనీ అక్కడే కొంతకాలం గడుపుదాం," అన్నది కమల.

కారు స్టార్టయింది. ఒకమైలు వెళ్ళిందోలేదో ఇంకో కారు అతివేగంగా పెద్దగా హారన్ మోగించుకుంటూ కమల కారును దాటి వెళ్ళిపోయింది. కమల ఆ కారులో ముందుసీటులో ఇద్దరు మగాళ్ళుండటంమటుకే చూసింది. మరుక్షణం దుమ్మువచ్చి కమలకారును ఆవరించింది.

ఈ సంఘటనను కమల అప్పుడే మరిచిపోయి ఉండు



నేమో. కాని మరో రెండుమైళ్ళు ముందుకు పోయాక ఈ దూసుకుపోయిన కారే రోడ్డుకు ఒకపక్కగా నిలబెట్టి ఉంది, దాని ముందుసీటులో కూర్చున్నవారిలో ఒకడై ఉంటాడు, రోడ్డుకడ్డంగా నిలబడి కమలకారును ఆపించాడు. నిలిచిపోయిన కారును డ్రైవ్‌చేస్తూఉండిన మనిషి కారు బానెట్ ఓపెన్‌చేసి ఏవో వైర్లు లాగి పరీక్షిస్తున్నాడు.

కమల కారును ఆపిన మనిషి, చూపులకు నవనాగరీకుడులాగే ఉన్నాడు, నవ్వుతూ కారులోకి తొంగిచూసి, "క్షమించాలి. నా స్నేహితుడికి డ్రైవింగ్ తెలుసుగాని మరమ్మతు తెలీదు. డ్రైవర్, ఒక్కక్షణం వచ్చి మా కారుకేమొచ్చిందో చూస్తావా?" అన్నాడు.


డ్రైవరు కమలకేసి చూశాడు. "వెళ్ళి త్వరగా రా," అన్నది కమల.

"థాంక్యూ!" అన్నాడు కొత్త మనిషి.

డ్రైవరు కారును కొంచెందూరంలో పక్కగా పెట్టి వెనక్కువెళ్ళి ఆగిపోయిన కారును పరీక్షించసాగాడు. అతనితో వెళ్ళిపోయిన పెద్దమనిషి కమలకారుదగ్గిరికి ఒంటరిగా తిరిగివచ్చాడు. స్వతంత్రంగా తలుపుతెరిచి ముందు సీటులో కూచుని కమలవేపు తిరిగి, "మీకు లేనిపోని శ్రమ ఇచ్చాం. మీ పేరేమిటో తెలుసుకోవచ్చా?" అన్నాడు.

కమలకు మంచి అవకాశం. చిట్టిపేరు చెప్పేసింది.

"అట్లాగా!" అన్నాడు పెద్దమనిషి, ఇప్పుడంతా అర్థమైపోయినట్టు. "అందుకే మీ ముఖం ఎరిగినట్టుగా ఉంది. మీరు పిక్చర్లలో వేషంవేస్తారుగదూ? మీ పిక్చర్లు రెండు మూడు చూశాననుకుంటాను."




కమల అతనికేసి విశాలంగా నవ్వింది. అతని మాటలకు ఔననలేదు, కాదనలేదు. "ఈ మనిషి ఇదివరకు చిట్టిమీద వ్యామోహం కలవాడుకాకపోతే ఇకముందు జన్మజన్మకీ చిట్టిని మరవలేడు. చిట్టిని ప్రత్యక్షంగా చూసి మాట్లాడానని మునిమనవలక్కూడా చెప్పుకుంటాడు," అని తనలో తాను అనుకుంది.

తాను ఏ నాగయ్యనో ప్రత్యక్షంగా చూసి మాట్లాడితే ఏమేమి అనుకుని ఉండేదో అదంతా ఆ మనిషికి ఆపాదించింది; పైపెచ్చు చిట్టికి మంచి పబ్లిసిటీ చేసిపెడుతున్నాననికూడా అనుకుంది.

"చాలా సంతోషం. నేనెప్పుడూ సినిమా తారలను పరిచయంచేసుకోలేదు. మీరెప్పుడూ అంతరిక్షాన ఉంటారు మరి. మేమంటే నేలమీద పాకుతూఉంటాం. నాబోటి వాడిక్కూడా తార అనగానే అంతో ఇంతో వ్యామోహం ఉంటుంది; కాలేజీ కుర్రాళ్ళలాగా బయటపడిపోంగాని," ఆయన నవ్వాడు. ఏం చెయ్యాలో తెలీక కమలకూడా నవ్వింది.

"నేను వ్యాపారంచేసుకుంటూ ఉంటాను. జాగ్రత్తగా చేసుకుంటే ఉద్యోగంకంటె వ్యాపారం మేలనిపిస్తుంది. చదువు పూర్తిఅయినాక చాలాకాలం వృథాచేశాను. అప్పుడే వ్యాపారంలోకి దిగితే ఇంకా బాగా గడించిఉందును."

"జీవితానికి డబ్బే ప్రధానమా?" అన్నది కమల.

"రెండుచేతులా గడించే సినిమా స్టార్ ఆ మాట అనటం చిత్రంగా ఉంది. డబ్బులేనివాడు దుబ్బుకు కొరగాడు. ఒక సమయంలో నేను స్వతంత్రంజీవిని కాకపోవటం నాకు చాలా దెబ్బతీసింది. ఈ పొగాకు వ్యాపారంలో నేను చేసుకున్న అరలక్ష ధారపోసినా ఆ నష్టం పూడేదికాదు. డబ్బు ప్రధానంకాని మాట నిజమేగాని డబ్బుకన్న విలవైన అనేకవాటికి డబ్బే కీలకం.... నేను మిమ్మల్ని బోర్ చెయ్యటంలేదుగద?"

"లేదు, లేదు. కాని మీరు చూసిన పిక్చర్లలో మీకేది ఇష్టం?"

"ఆ ప్రశ్నకు సమాధానం మీకు చెప్పటం నాకిష్టంలేదు," అన్నాడతను,

"కొంపతీసి నాపిక్చర్లంటే మీకు ద్వేషమా ఏం?" అన్నది కమల.

"ద్వేషంకాదు, ప్రత్యేకాభిమానం!"

"ఎందుచేతా? నేను నటించిన పిక్చర్లలో కొన్ని బొత్తిగా బాగాలేవనిపించుకున్నాయే?"

"అయినా ఫరవాలేదు. మీబొమ్మ తెరమీద చూస్తేనే నాకు పరమానందం."

కమలచెవికి ఇది పెద్దకోతగా తగిలింది.

"నన్ను వేళాకోళం చేస్తున్నారు!" అన్నదామె.

"లేదు. ప్రమాణపూర్తిగా!"

"నాకన్న గొప్పతారలు లేరనా?"

"ఉండవచ్చు. నాకులేరు .... మరిచిపోకండి నేను పొగాకునాణ్యం తెలిసినవాణ్ణి. అందులోనూ దొరపొగాకు, నాకు సినిమాలనుగురించి ఏమీ తెలీదు. మీపేరు కనిపించిన చిత్రమల్లా చూస్తాను. వీలయితే ఒకటికి పదిసార్లుకూడా చూస్తాను. మీ ఫొటోలు నాదగ్గిర చాలా ఉన్నాయి."

కమలకు ఈ మాటలను నమ్మాలో నమ్మకూడదోకూడా తెలియలేదు. చిట్టికి ఇటువంటి ఆరాధకుడుండటం నిజమైతే చిట్టిని చంపాలనిపించింది. కమలలెక్కన ఏ సినిమాతారను ఇంతగా ఆరాధించేవాడైనా వట్టి దద్దమ్మ అన్నమాటే. చిట్టికే ఇటువంటి భక్తుడుండటమూ, వాడు తనపాల బడటమూ ఎందుకు జరగవలిసివచ్చింది?

"నామీద ఇంత అభిమానంగల మనుషులున్నారని నాకు కలలోకూడా తట్టలేదు. బహుశా మీరుతప్ప ఇంకొకరుండరు. మీరే నాకు తలవనితలంపుగా తారసిల్లటం చూడండి, ఎంత చిత్రమో!" అన్నది కమల. అతను అబద్ధం చెప్పుతున్నట్టయితే తనమాటలు వెటకారంగా అతనికి స్ఫురించాలని కమల ఉద్దేశం.

"అట్లా అనకండి. మనం భగవంతుడి చేతికీలు బొమ్మలం. నా జీవితంలో ఇటువంటివి చాలా అయాయి. నేను వ్యాపారంచేసి డబ్బు సంపాదిస్తానని నాగర్భ శత్రువులుకూడా అనుకోలేదు."

కమల ఒక కొంటెఆలోచన చేసింది. ఆమెకళ్ళు మెరిశాయి.

"మీరు నాకు ఉత్తరాలేమైనా రాశారా?" అన్నదామె.

"అటువంటి ప్రశ్న వెయ్యటం అధర్మం. ఒక వ్యక్తిమీద దహించే ప్రేమ ఉన్నప్పుడు దౌర్బల్యంలో రాసేస్తాం, వాటివిషయం నిలదీసి స్టేట్‌మెంట్ కోరటం భావ్యమా?" అన్నాడతను.

"మీ పేరు చెప్పండి," అన్నది కమల.

"దేనికి? ఉత్తరాలు చూసుకోవటానికా?" అన్నాడతను.

"ఇంతసేపు మాట్లాడాం. నేనెవరో మీకు తెలుసు. మీరెవరో నాకు తెలీదు. అన్యాయంకాదా?"

"కాదు. మీరు జగమెరిగిన సినిమా స్టార్. నేను పొగాకు కొని అమ్మే అభాగ్యుణ్ణి. నాపేరడక్కండి."

డ్రైవరు తిరిగివచ్చాడు.

"బాగయిందా?" అన్నాడు పెద్దమనిషి.

"లూజ్‌కాంటాక్ట్, సార్."

రెండోబండీ స్టార్ట్అయిన చప్పుడు వినిపించింది. పొగాకు వర్తకుడు, "మరి నేను శలవు పుచ్చుకుంటాను. మళ్ళీ పక్షితీర్థందగ్గిర కలుద్దాం. మీరు మహాబలిపురంకాదా పోతున్నది? భేష్! ఇకనేం?" అని వెళ్ళిపోయాడు.

కమలకారు స్టార్టయేలోపుగా రెండోబండీ రెండోసారి ముందుకు దూసుకుపోయింది.

## 3

పొద్దూకిపోయింది. కమల గృహోన్ముఖురాలయింది. ఆమె కోరిక ఫలించింది. కనీసం ఒక్క వ్యక్తిని మోసగించింది. ఆ పొగాకు వర్తకుడు తనను చిట్టి అనే అనుకున్నాడు, ఆ మనిషికి చిట్టిమీద ఎంత వ్యామోహమో! చదువుకున్నవాళ్ళలోకూడా ఇంత సినిమా తారల పిచ్చి ఉంటుందికాబోలు.

కమలకు ఒక్క విషయమే అర్థంకాలేదు. అతను తనమీద—అంటే చిట్టిమీద—అంత అనురాగాభిమానాలుండికూడా తన పేరూ ఊరూ ఎందుకు దాచుకున్నాడూ? తనతో ఎంతోసేపు ఒంటరిగా సంభాషించాడు, పక్షితీర్థం కొండదగ్గిరా, మళ్ళీ షోర్‌టెంపుల్‌దగ్గిరా, సముద్రతీరానా తనతో చాలాసేపు ఏకాంతంగా నడిచాడు. కాని ఒక్కసారయినా తనను ముట్టుకోవటానికికూడా యత్నించలేదు. అతనికి చిట్టిమీద ఉన్న అభిమానం కేవలం అభౌతికమే అయితే ఇంతమంది సినిమాతారలుండగా, హిందీ తారలూ, హాలీవుడ్ తారలూ ఉండగా తననే—అదే, చిట్టినే—ఎందుకు ఏరుకోవాలీ? ఏమిటి చిట్టి ఆధిక్యత?

"అన్నీ వొట్టివే! అతనికి చిట్టిమీద ఏమీ అభిమానం

లేదు. సినిమా స్టార్ దొరికింది, ఏడిపిద్దామనుకుని ఉంటాడు. అంతే!" అనుకున్నది కమల. కాని సాక్ష్యం కొంత ఈ సిద్ధాంతానికి అనుకూలంగా లేదు. అతను తనను మోసంచెయ్యదలిస్తే కొన్ని కొన్ని విషయాలు చెప్పవలసిన అవసరంలేదు. అతను అన్న మాటలలో కొన్ని అతనికే తెలీకుండా పైకివచ్చేసినట్టు కనపడ్డాయి. అనేకసార్లు కమల, అతనికి తనమీదే ఆ ప్రేమంతా అన్న భ్రమకుకూడా లోనైంది. అతను మాట్లాడుతున్నాననుకుంటున్నది చిట్టితోనన్న విషయం జ్ఞాపకంచేసుకోవలి సొచ్చేది.

అతను తన స్నేహితుణ్ణికూడా విడిచేసి కమలవెంటనే మహాబలిపురంలో చూడదగిన స్థలాలన్నీ తిరిగాడు. సముద్రతీరాన గుడినీడలో చాలాసేపు కూచున్నారు. అక్కడే అతను కమలను పెళ్ళివిషయం—అంటే చిట్టి పెళ్లివిషయం—అడిగాడు. చిట్టికింకా పెళ్ళికాలేదని తెలుసుకున్నాడు. తానుకూడా వివాహం చేసుకోలేదని చెప్పాడు. మొదట్లో సంపాదించందీ చేసుకోరాదనుకున్నాట్ట. సంపాదించటం ప్రారంభించాక ఎవర్ని చేసుకోవాలో తెలీలేదట. కొంపతీసి తనను పెళ్ళాడమంటాడేమోననుకున్నది కమల. కాని అతని ధర్మాన ఆ మాటపుటుకు అనలేదు.

మధ్యాన్నం అందరూకలిసి భోజనంచేశారు. పొగాకు వర్తకుడు కమలను ప్రసిద్ధ సినిమా తారగా తన స్నేహితుడికి పరిచయంచేశాడు.

""ఓ, అట్లాగా? నేను తెలుగుపిక్చరు చూడను," అన్నాడతను. భోజనం అయిన కొద్దిసేపటికి ఆ స్నేహితుడు సముద్రంలో ఈదటానికి వెళ్ళాడు. పొద్దూకేదాకా రాలేదు.

బయలుదేరపోయేటప్పుడు పొగాకువర్తకుడు కమల దగ్గిర శలవుపుచ్చుకున్నాడు. తనకు రోజల్లా చాలాసరదాగా గడిచిందన్నాడు. అప్పటికీ తనపేరు చెప్పనన్నాడు. పైపెచ్చు, "కొంచెం ఆలోచిస్తే మీకేజ్ఞాపకం వస్తుంది," అన్నాడు. కారెక్కాడు, వెళ్ళిపోయాడు. ఆకారు లేపిన దుమ్ము అణిగాక కమలకూడా బయలుదేరింది....

కమల ఇంటికి చేరేవరకూ మళ్ళీ ఆకారు కనిపించలేదు. కారు నంబరుమాత్రమే ఆమెకు జ్ఞాపకంవుంది.

ఇంటికివచ్చాక కమల జరిగిందంతా చిట్టికి చెప్పవలిసొచ్చింది. ఎన్నివివరాలు చెప్పినా చిట్టికి తృప్తి కలిగినట్టు కనపడలేదు. "ఆ మనిషి ఎవరైతే మనకేం? మంచి టోపీ వేశాం!" అన్నది కమల స్నానానికిపోతూ.

చిట్టి టెలిఫోన్ డైరెక్టరీతీసి ఒక్కొక్క హోటలే రింగప్ చెయ్యసాగింది.

కమల స్నానంచేసి బట్టలుకట్టుకుని కిందిహాలులోకి వచ్చేసరికి చిట్టి హాలంతా చాలాషోగ్గా తయారుచేసి పెట్టింది. తనకున్న చీరెల్లోకల్లా అందమైనచీరె కట్టింది. ఉన్న నగలన్నీ పెట్టుకుంది. రంభలాగా తయారై సోఫాలో కూచుంది.

"ఏమిటి చిట్టీ? ఏమిటిదంతా?" అన్నది కమల.

""ఎవరో వస్తున్నారు. పాతస్నేహితులు. ఇప్పుడే టెలిఫోన్‌మీద తెలిసింది," అన్నది చిట్టి నవ్వుతూ; "రా, కూచో!"

ఆక్షణంలోనే బయట కారుహారన్ వినిపించింది. కమల చెవులకది పరిచితమైన శబ్దంగా తోచింది. అందులో ఏమీ ఆశ్చర్యంలేదు. మరో క్షణంలో సాక్షాత్తూ ఆ పొగాకు వర్తకుడే లోపలికివచ్చాడు. అతనిచూపు కమలమీదుగా విసురున చిట్టిమీదికి పోయింది.

"రండి, మూర్తిగారూ!" అన్నది చిట్టి లేచి ముందుకు వస్తూ.

"చిట్టీ"

అతనూ చిట్టీ తనఎదుట కౌగిలించేసుకుంటారేమో చూద్దామనుకున్న కమలకి ఆశాభంగమయింది. కోపం కూడా వచ్చింది. తనకు ఆరంగుళాల దూరంలోకి రాని ఈ దుర్మార్గుడు నేరుగా చిట్టిదగ్గిరికి వెళ్ళి బుగ్గమీద తట్టి, "ఎట్లావుంది సినిమా స్టార్?" అన్నాడు.

కమల నిశ్శబ్దంగా మెట్లెక్కి పైకి వెళ్ళిపోయింది. ఆమెనెవరూ వారించినవారులేరు.

